క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని సర్క్యులర్ జారీ చేశారని తహసీల్దార్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. అలానే మండలంలోని కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివన్నారాయణ తెలిపారు. పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

నిత్య అన్నదాన సంఘం ఏకగ్రీవం


నూతన కమిటీ

అద్దంకి: సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రంలో కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. కమిటీ నూతన పాలకవర్గ అధ్యక్షులుగా ఆదిపూడి మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా ముక్తి నూతలపాటి వెంకటేశ్వరరావు, కంచిభోట్ల వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా పమిడిఘంటం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి గా పుట్టంరాజు సాయికుమార్, కోశాధికారిగా ధేనువకొండ సుబ్బారావు, గౌరవ ఆత్మీయ అంతరంగిక న్యాయ ధర్మ కార్యనిర్వాహక సేవా నిర్వాహణాధికారిగా డాక్టర్ బొప్పూడి నాగ రమేష్, ఐపీఎస్ (రిటైర్డ్ డీజీపీ) పశ్చిమబెంగాల్, గౌరవ అధ్యక్షులుగా కోటా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా దుర్భాకుల సుబ్రహ్మణ్యం, వంగర హరిశంకరావధాని, పుట్టంరాజు రామకష్ణను ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. సభ్యులను పలువురు అభినందించారు.

23న జిల్లా మహాసభలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అద్దంకి: సీపీఐ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ పిలుపునిచ్చారు. ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23న అద్దంకిలో జిల్లా రెండో మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దానికి నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలని కోరారు. దానికి సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్రరావు, వినుకొండ మల్లికార్జునరావు, కోశాధికారి కేఎల్‌డీ వరప్రసాద్, కోమటిగుంట జానార్దన్, వసంతరావు, చెన్న, కె. యాకోబు, దిలీప్ పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులు, కూలీల చెల్లింపులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ దాసు తెలిపారు. చీరాల మండల పరిషత్ కార్యాలయం వద్ద జరగనున్న సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందం తనిఖీలో చేపట్టిన అంశాలపై ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సామాజిక తనిఖీకి ఎంపీడీఓ, డీఎల్‌పీవో, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ, ఏపీడీ, సోషల్ ఆడిట్ ప్రతినిధులు, మండల ప్రత్యేకాధికారి, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ ఏఈ, డీఈ, పంచాయతీల కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఏపీఓ దాసు కోరారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకి: మునిసిపాలిటీలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ముందు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాని కోసం గత వారం రోజుల నుంచి నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. నిరసనలతో కాకపోతే తరువాతి రోజుల్లో సమ్మెలు, పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నేయకుడు ఉసురుపాటి శామ్యూల్, కె. జాన్, మారుతి, మార్కు, రవి, కార్మికులు పాల్గొన్నారు.


గంగానమ్మ చెట్టు వద్ద డ్రైనేజీ


పాత తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రధాన డ్రైనేజీ

పట్టణం మురుగుమయం

- అద్దంకిలోని ప్రధాన డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త
- సాగరు కాలువలో నిలిచిన మురుగు
- సీజనల్ వ్యాధుల భయంతో ప్రజలు



ఎన్నెస్పీ కాలువలో పేరుకుపోయిన మురుగు

అద్దంకి: ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. పట్టణంలోని ప్రధాన డ్రైనేజీల్లో మురుగు దెబ్బకు స్థానికులు బెంబేలెత్తుతున్నారు. వర్షాలకు మురుగుకు తోడు నీరు అదనంగా చేరడంతో దోమలు ప్రబలుతున్నాయి. మరో వైపు సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. మునిసిపాలిటీ అధికారులు ప్రధాన డ్రైనేజీల్లో మురుగు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోకుంటే ఇబ్బందులు తప్పేలా లేవు.

మురుగు నిల్వలు ఇలా..

పట్టణంలో జనాభా 50 వేలకు మించి పోయింది. వర్షాలు కురుస్తున్నప్పుడు వీధుల నుంచి వచ్చే వర్షపు నీరు ప్రధాన డ్రైనేజీల్లోకి వెళుతుంది. అక్కడే చెత్తా చెదారం కూడా పేరుకుపోతోంది. ముందుగా చిన్న చిన్న కాలువల్లో పూడికతీసినా ఉపయోగం లేకుండా పోతోంది. ఇలా ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోతోంది. ముఖ్యంగా పాత తహసీల్దారు కార్యాలయం సమీపంలోని ప్రధాన డ్రైనేజీలో వంతెన వద్ద చెత్త పేరకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. అదే విధంగా బంగారమ్మ చెట్టు వద్ద కూడా మురుగు పేరకుపోయింది. పట్టణంలోని నామ్ రహదారి నుంచి ఎస్టీఆర్ కాలేజీ మీదుగా రేణింగవరం రహదారి వరకు పట్టణం నుంచి వెళ్లే ఎన్నెస్పీ కాలువలో మురుగు దుర్గంధ భరితంగా మారింది. ఎక్కడి మురుగు అక్కడే నిలిచింది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో నివశించే ప్రజలు దోమలతో నానా అవస్థలు పడుతున్నారు. ఏ వ్యాధులు సోకుతాయోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగును తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దోమల మందు పిచికారీ ఏదీ..

మురుగు ప్రదేశాల్లో, డ్రైనేజీ నిలిచిన ప్రాంతాల్లో దోమల మందు, ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులు మరిచారు. దీంతో పట్టణంలో ఎటు చూసినా దోమల వ్యాప్తి ఎక్కువైంది. దీనికితోడు పలు కాలనీల్లో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపైకి వదులుతున్నారు. ఇలా ఎటు చూసినా అపరిశుభ్రవాతావరణం నెలకొంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.


చింతపల్లిపాడులో విశేష అలంకరణలో చెన్నకేశవస్వామి


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కొణిదెనలో అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి


కేవీ పాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

యద్దనపూడి: శ్రీ మహావిష్ణువు శేషతల్పంపై యోగా నిద్రకు ఉపక్రమించే రోజు (శయన ఏకాదశి) కనుక తొలి ఏకాదశిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలి ఏకాదశి పండగను మండలంలో ఆయా గ్రామాల ప్రజలు భక్తిప్రవత్తులతో జరుపుకున్నారు. ఆదివారం పండుగను పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శివాలయాల్లో రుద్రాభిషేకాలు, వైష్ణవాలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు, గీతాపారాయణ చేశారు. మండలంలోని పూనూరు వేణుగోపాలస్వామి, త్రిపురాంతకస్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, యద్దనపూడి వెంకటేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.

కారంచేడు: తెలుగు పండుగల్లో ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు పెద్దపీట వేసే పండుగ తొలి ఏకాదశి అని మండల కేంద్రమైన కారంచేడు పెద బజారు శివాలయం, మాధవస్వామి దేవాలయం, గంగమ్మ తల్లి దేవాలయం పూజారులు కారంచేటి వీరాంజనేయశర్మ, వేదాంతం కిరణ్‌కుమార్, ఆవుల రాజేష్ భక్తులకు తెలియజేశారు. ఆదివారం తొలి ఏకాదశి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పండగ విశిష్టతను తెలిపారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

చినగంజాం: వైకుంఠ ఏకాదశి(తొలి ఏకాదశి) పండగను మండలంలోని ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైష్ణవ దేవాలయాల్లో విష్ణుమూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి ఆషాఢ మాసంలో శుద్ధ ఏకాదశి రోజు నిర్వహించే పండగ కావడంతో స్వామి వారికి అర్చకులు పూజలు నిర్వహించి అనంతరం నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులందరికీ పేలపిండిని ప్రసాదంగా అందించడంతో స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయ పూజారి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు మాట్లాడుతూ విష్ణు భక్తులకు తొలి ఏకాదశి పండుగ మొట్టమొదటి పండుగ అని తెలిపారు. కుచేలుడు కృష్ణునికి పేలాలు సమర్పించిన రోజు అని వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తి వైకుంఠంలో యోగనిద్రలోకి వెళ్ళే రోజు అని ఈ రోజు నుంచి మొదలుకొని నాలుగు నెలలపాటు భక్తులు చాతుర్మాస దీక్ష నిర్వహిస్తారని ఆలయాల్లో హరేనామ సంకీర్తనలు, ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. ఈ సమయంలో విష్ణుమూర్తి భక్తులు మొర ఆలకిస్తాడనేది ప్రగాఢ విశ్వాసం అని తెలిపారు.


నూతలపాడు గ్రామంలో హరే నామ సంకీర్తనలో భక్తులు


కారంచేడు గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజల్లో భక్తులు


చీరాల: నగరోత్సవంలో గరుడవాహనంపై ఊరేగుతున్న మదనగోపాలస్వామి

పర్చూరులో..

మండలంలో తొలి ఏకాదశి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు విష్ణు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండలంలోని నూతలపాడు గ్రామంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో హరే నామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చీరాల అర్బన్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పేరాల్లోని శ్రీ మదనగోపాలస్వామి దేవాలయంలో తెల్లవారుఝాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు, చెన్నకృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా వ్రతాలను నిర్వహించారు. తొలిఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే విశేషమైన రోజని, ఆ రోజును తొలిఏకాదశి, శయన ఏకాదశి అని పిలుస్తారన్నారు. ఈ రోజు స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులతో నగరోత్సవాన్ని నిర్వహించారు. అలానే పట్టణంలోని వీరరాఘవస్వామి దేవాలయంలో తొలిఏకాదశి సందర్భంగా వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు వీరరాఘవ స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

బల్లికురవ: శ్రీమహావిష్ణువు యోగా నిద్రలోకి వెళ్లే రోజును తొలి ఏకాదశి అని పిలుస్తారని ఈ రోజు చేసే పూజలు, వ్రతాలు అత్యంత ఫలితాన్ని ఇస్తాయని ఆలయాల అర్చకులు ఐ. శోభనా చార్యులు, సుబ్బా చార్యులు, శ్రీమారుతి నరేష్, ఎస్. శ్రీనివాస అనిల్ కుమార్, బి. గోవర్ధనా చార్యులన్నారు. ఆదివారం మండలంలో వాడవాడలా ఏకదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆలయాలకు భక్తులు పోటేత్తారు. కొణిదెన, కొత్తపాలెం, కొండాయపాలెం, కొమ్మినేనివారిపాలెం, కొత్తమల్లాయపాలెం, గ్రామాల్లోని విష్ణు ఆలయాల్లో జరిగిన పూజల తదుపరి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఏకలవ్యుని చరిత్ర అజరామరం


చీరాల: ఏకలవ్య జయంతి కార్యక్రమంలో నాయకులు

చీరాల టౌన్: ఏకలవ్యుని జయంతి వేడుకలను ఆదివారం ఏపీ ఎరుకల సేవా సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తుమ్మా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామ్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘం నేతలు ఏకలవ్యుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు గిరిజన సంఘం నేతలు మాట్లాడారు. ఏకలవ్యుని చరిత్ర భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన చిత్తశుద్ధితో విద్య నేర్చుకున్న గుణాన్ని అంతా అలవర్చుకోవాలన్నారు. గిరిజనలంతా ఐక్యంగా ఉండి సంఘ అభివృద్ధితో పాటు సామాజికంగా, ఆర్థికంగా వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాలపర్తి శ్రీనివాసరావు, భోగిరి శ్రీకాంత్, పాకాల రాజేష్, ఎం.చక్రవర్తి, బచ్చు భరత్, దాసరి శ్రీకాంత్, కె.రమేష్, పృధ్వీరాజ్, రామ్‌నగర్, ఆదినారాయణపురం గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి


బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

చీరాల: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ చరిత్రలో సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా కొనసాగారన్నారు. రైల్వే మంత్రిగా, కార్మికశాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారన్నారు. అనేక సంస్కరణలు చేశారని, నేటికీ ఆ సంస్కరణ ఫలాలను ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం చీరాల అధ్యక్షుడు తేళ్ళ రాంబాబు, యువజన విభాగం సభ్యులు రాంబాబు, పార్టీ అనుబంధ విభాగాల సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్‌తో సమస్యల పరిష్కారం


పోతినివారిపాలెంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

పోతినవారిపాలెం (కారంచేడు): ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు ఎన్నో పరిష్కారం అవుతున్నాయని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం మండలంలోని పోతినవారిపాలెంలో విజబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతు గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం స్థానిక పోలీస్‌లను ఆశ్రయించలేక ప్రజలు సతమతమవుతుంటారన్నారు. పోలీసులను చూసి భయపడాల్సిన పనిలేదన్నారు. దొంగలు, తప్పు చేసిన వారు మాత్రమే పోలీసులను చూసి భయపడాలన్నారు. గ్రామాల్లో నేరాలను అదుపు చేయడానికి ఈ విజబుల్ పోలీసింగ్ వ్యవస్థ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎక్కడ పేకాటలు, కోడిపందేలు, బహిరంగ మద్యపానం వంటివి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


ముస్తాబైన పీర్లు


ముస్తాబు చేసిన పీర్ల వద్ద భక్తులు

బల్లికురవ: ధర్మపరిరక్షణకు, త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీకే మొహర్రం పర్వదినమని కొప్పరపాడు, పీర్లసావిడి పెద్ద షేక్ ఆదామ్ సాహెబ్ అన్నారు. శనివారం రాత్రి గ్రామ కూడలిలోని పీర్లచావిడిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం పీర్లను ముస్తాబు చేసి పెద్ద షరగత్‌లో భాగంగా గ్రామోత్సవం చేపట్టారు. అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సోమవారం అగ్ని గుండాన్ని పూడ్చి పీర్లను తిరిగి పీర్ల చావిడిలోకి చేరుస్తామని అంతటితో వేడుకలు ముగుస్తాయని చెప్పారు. వేడుకల ఏర్పాట్లను షేక్ సైదా, అబ్దుల్లా, మహబూబ్ సుభాని, మౌలాలి, కరీం తదితరులు పర్యవేక్షించారు. రెండు రోజులుగా జరుగుతున్న వేడుకలకు బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది.

పీర్ల పండగకు ముస్తాబైన పీర్లు

సంతమాగులూరు(అద్దంకి): మొహర్రం సందర్భంగా సోమవారం నిర్వహించనున్న పీర్ల పండుగకు సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులోని మసీదులో పీర్లు ముస్తాబు అయ్యాయి. దానిలో భాగంగా అగ్ని గుండం ఏర్పాటు చేశారు. పీర్ల ఊరేగింపు, నిప్పుల గుండ ప్రదర్శన ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


కొప్పరపాడులో విద్యుత్ దీపాలతో అలంకరించిన పీర్ల చావిడి


అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు

దేవస్థానానికి బీరువా వితరణ

అద్దంకి రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని చెర్వుకొమ్ము పాలెం గ్రామ దేవత అంకమ్మ తల్లి దేవస్థానానికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ మాజీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో ఆదివారం ఇనుప బీరువా అందజేశారు. రోటరీ అధ్యక్షుడు బాచిన వివర్ధర పూర్ణ చంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ గుశేఖర్, యు. దేవపాలన, పువ్వాడ రామకోటేశ్వరరావు, అన్నంగి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


దేవస్థానానికి బీరువా అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

9న కార్మిక, ఉద్యోగుల సమ్మె


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అద్దంకి రూరల్: కార్మిక, ఉద్యోగ సంఘాలు ఈనెల 9న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కాపూరి రఘుచంద్ అన్నారు. ఆదివార సీఐటీయూ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలో సైకిల్, ఆటో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక ఈంబేడ్కర్ విగ్రహం వద్ద కాపూరి రఘుచంద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలింతంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయటం దుర్మార్గమన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి


చీరాల: కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ చిట్టిబాబు


కారంచేడులో వ్యాక్సిన్‌లు వేస్తున్న డాక్టర్ భాగ్యరాజ్

చీరాల అర్బన్: పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.చిట్టిబాబు అన్నారు. జోనోసిస్ డే సందర్భంగా ఆదివారం స్థానిక వైకుంఠపురం రైల్వేగేటు వద్ద గల పశువైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 56 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జోనోసిస్ అంటారని, పెంపుడు జంతువులు కరిచినప్పుడు వ్యాక్సిన్ వేయడం తప్పనిసరి అన్నారు. పెంపుడు జంతువుల లాలాజలంలో జోనోసిస్ వ్యాధులు కలుగచేసే క్రిములు ఉంటాయని, లాలాజలం వలన రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు.

కారంచేడు: పెంపుడు కుక్కల పట్ల యజమానులు తగు జాగ్రత్తలు పాటించాలని కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ భాగ్యరాజ్ అన్నారు. ఆదివారం ఆయన జాతీయ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పశువైద్యశాలలో ప్రత్యేక వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. పెంపుడు కుక్కలకు సైతం ఈ వ్యాక్సిన్‌లు వేయించకపోతే చాలా ప్రమాదాలున్నాయన్నారు. కుక్కల వలన అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


అద్దంకి: వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ బ్రహ్మయ్య

అద్దంకి: పెంపుడు జంతువులతోనే జోనోసిస్ వ్యాధి మనుషులకు సక్రమిస్తుందని పశువైద్యాధికారి బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువైద్యశాలలో జోనోసిస్‌పై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. 1885లో ర్యాబిస్ వ్యాధికి వ్యాక్సిన్‌ను కనుగొని కుక్కలకు వేశారని వివరించారు. పెంపుడు చిలుకలు, పావురాలు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్లు, వంటి ఏ ఇతర పెంపుడు జంతువు నుంచైనా ఈ వ్యాధి రావచ్చని చెప్పారు.